# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH



APRIL 1995

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రెసుకు **M.O.** చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్లు వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | కీర్తన పుస్తకం | రూ. 14-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**
Sambamurthi St., Ramaraopeta,
KAKINADA - 533 004.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone ; 0884-73722

Editor ;
J.C. CHOATE

Managing Editor
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 ఏప్రిల్ 1995 సంచిక 9

## సంపాదకీయం

### సహోదరులను కనిపెట్టియుండుట

### (Marking the Brethren)

"సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగ జేయు వారిని కనిపెట్టియుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలోనుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటల వలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" అని అపొ. పౌలు వ్రాసాడు (రోమా 16 : 17, 18).

ఒక వ్యక్తిని కనిపెట్టి యుండుట అంటే యేమిటి? అంటే అబద్ధ బోధచేయు వానిని సహోదరులకు తెలియ జేయుట, అట్టివాడు భేదములను ఆటంకములను కలుగజేసి పాపములో జీవించుచున్నాడని

తెలియజేయుట. ఇట్టివారిని గుర్తించినప్పుడు నమ్మకమైన సహవా
రులు ఇట్టివారిని గూర్చి జాగ్రత్తగ యుండాలి, వారు అపనమ్మకస్థు
లని, సంఘమునకు హానికలుగ జేయువారని గుర్తుంచుకోవాలి సాధ్య
మైనంతమట్టుకు వారితో కలియకూడదు. వారు భేదములను, ఆటంక
ములను కలుగజేయువారు గనుక క్రైస్తవులు వారి దుష్ప్రభావము
నకు దూరముగ యుండాలి. ఈలాగున గుర్తింపబడిన వారింకను తమ
దుష్టస్వభావము ననుసరించియే నడుచుకొనుచుంటే, అట్టి వారినుండి
సంఘము తొలగిపోవాలి. సహవాసమునుండి బహిష్కరించాలి. ఈ
పనిని స్థానిక సంఘము జరిగించాలి.

అనేకమంది తాము బహిష్కరింపబడిన స్థానిక సంఘమును
వీడి దూరప్రాంతములకు పోవుచు అక్కడ తమ అబద్ధబోధలను చేయ
నారంభింతురు. అయితే నమ్మకమైన క్రైస్తవులు వారిని గుర్తించి
పలు సంఘములకు అట్టివారిని గూర్చిన హెచ్చరిక పత్రికలు పంప
వచ్చును. ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టియుండుటయు,
వారిని సంఘసహవాసమునుండి తొలగించుటయు వేర్వేరు. సత్యము
నెరిగిన క్రైస్తవు డెవడైనను అసత్యమును బోధించువానిని, తన
స్వప్రయోజనము కొరకు భేదములను ఆటంకములను కలుగజేయు
వానిని కనిపెట్టి యుండవచ్చును. అయితే అట్టివానిని స్థానిక సంఘము
మాత్రమే సహవాసమునుండి తొలగించవలయును (1 కొరింథీ 5).

అందువలన సహవాసమునుండి తొలగించబడుట యనునది ఒక
అబద్ధ బోధకునికిని అతడారాధన చేయు స్థానిక సంఘమునకును మధ్య
జరుగును. ఒక స్థానిక సంఘముతో కూడి ఆరాధన చేయువాడొకడు
అసత్యబోధ చేయుట కారంభించ వచ్చును లేదా అతని ప్రవర్తన
వలన ప్రభువు సంఘమునకు అప్రతిష్ట కలుగజేయు చుండవచ్చును.
అందువలన ఆస్థానిక సంఘ సభ్యులు అతనికి క్రమశిక్షణను గూర్చి
హెచ్చరిక చేయుట ఆవశ్యకమగును.

మొదటిగా ఒక సహోదరుడు వెళ్లి అతనితో మాట్లాడవలెను. అతడు తన్నుతాను సరిదిద్దుకొనినయెడల ఆ సమస్య అంతటితో అంత మగును. అతడు సరిదిద్దుకొనుటకు సమ్మతించని యెడల ఇద్దరు లేక ముగ్గురు సహోదరులు అతనితో మాట్లాడవలెను. అతడు మారు మనస్సు నొంది తన్నుతాను సరిదిద్దుకొనిన సరి, అతడు మారు మనస్సు నొందని యెడల అతని సంగతి సంఘము ముందుంచవలెను. అతడు సంఘము మాట విని మారుమనస్సునొందిన యెడల ప్రభువతనిని క్షమించును. సంఘము కూడ క్షమించును. అయితే అతడు మారు మనస్సు నొందక, సంఘము మాటలను వినకపోయిన యెడల అతని నుండి సంఘము తొలగిపోవలెను. అతడు మారుమనస్సు పొంది సంఘ మునకు తిరిగి చేరువరకు సహవాసమునుండి తొలగింపబడినవాడగును. సహోదరులతనితో సహవాసము చేయరాదు. అట్టివానితో భోజనము కూడ చేయరాదు. మరియు ఆస్థానిక సంఘము ఇతర స్థానిక సంఘము లకు అతని గూర్చి తెలియ జేసిన యెడల వారును అట్టివానికి తమ సహవాసము నందించరు (మత్తయి 18 : 15-17; 1 కొరింధీ 5).

లేఖనములు ఉపదేశించురీతిగ సంఘ క్రమశిక్షణ నలవరచిన యెడల అది చాల శక్తివంతముగ యుండును. అట్లుగాక అక్కడక్కడ యున్న వ్యక్తిగత సహోదరులు అట్టివానిని బహిష్కరించిన యెడల దానిలో ప్రయోజనం యేమీ వుండదు.

"క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను ఈ బోధను లేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీయింట చేర్చు కొనవద్దు, శుభమని వానితో చెప్పవద్దు. శుభమని వానితో చెప్పు వాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును" అని భక్తుడైన యోహాను వ్రాసెను ( II యోహాను : 9, 10).

ఒక సహోదరుని కనిపెట్టుటగాని, సహవాసమునుండి తొలగించుటగాని అతని నాశనము చేయుటకుగాక అతడు మారుమనస్సు పొంది, క్రీస్తుతోను, ఆయన సంఘముతోను సత్సంబంధమును కలిగియుండునట్లు చేయుటకే జరిగించవలెను. మనమేమి చేసినను ఆ సహోదరుడు నిత్యనాశనమును ఎంచుకోవచ్చును. అయితే అప్పుడు అతని నాశనమునకు మనము బాధ్యులము కాము.

— o —

## క్రీస్తు యొక్క శరీరము

## ( The Body of Christ )

"అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి
వేరువేరుగా అవయవములై యున్నారు" (1 కొరి 12 : 27).

సంఘము యొక్క తత్వాన్ని అపార్థము చేసికొనుటవలన క్రొత్తనిబంధన సంఘమును గూర్చిన అపోహలున్నాయి. అందువలన నిగూఢమైన సంఘము యొక్క తత్వాన్ని అర్థము చేసికొనుట అవసరం. అప్పుడు సంఘము యొక్క పని, ప్రయోజనము, లోకములో దాని గుర్తింపును కూడ గ్రహించుకోగలము.

అపొ. పౌలు సంఘమును క్రీస్తుయొక్క శరీరముగా వర్ణించాడు. సంఘము యొక్క ఆచరణానుసారమైన తత్వాన్ని ( 1 కొరింథీ 12 : 23-26), కార్యాచరణానుసారమైన తత్వాన్ని వర్ణించుటకు (1 కొరి 12 : 27) ఈ పదములు వాడబడినవి. ఈ పదజాలము యొక్క భావార్థాన్ని గ్రహించుకొంటేనేగాని క్రొత్తనిబంధన సంఘమును మనము అర్థము చేసికొనలేము. గనుక ఈ పదజాలము యొక్క భావం యేమిటి ?

## క్రీస్తుతో ఐక్యత

మొదటిగా ఈ పదజాలము క్రీస్తుతో ఐక్యతను సూచించు చున్నవి. ఒకని నమ్మకమును క్రీస్తుకు అప్పగించుట మాత్రమే మార్పు జెందుటకు సరిపోదు. గాని ఒకడు క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరములో ప్రవేశించుటలో ఆయనతో ఏకత్వము నొందుట. క్రీస్తు తట్టు మార్పుజెందు క్రియలో భాగముగా, మనము క్రీస్తులోనికి బాప్తిస్మము నొందుదుము. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా ? " (రోమా 6 : 3). క్రీస్తుతో ఐక్యత జెందే భావము ప్రత్యేకముగా రోమా 6 : 4 లో కనబడుచున్నది. "కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:4). "మనమందరము ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" అని అపొ. పౌలు చెప్పాడు (1 కొరి 12:13). బాప్తిస్మమునందు మనము క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరములో నాట బడుచున్నాము గనుక, ఆ క్రియలో ఆయనతో ఏకత్వమును పొందు చున్నాము.

క్రీస్తుతో ఈవకైక ఆత్మీయ సమైక్యతను వివాహముతో పోల్చ వచ్చును. స్త్రీ పురుషులిద్దరు వివాహములో జతపర్చ బడుచున్నప్పుడు వారి జీవితాలను ఒండొరులకు అంకితం చేసుకొనుట కంటే ఎంతో ఎక్కువ సంభవించును. వివాహములో గంభీరమైన ఏకత్వము సంభ వించును. అది ఎంత గంభీరమైనదంటే, వివాహములో భార్యభర్త లిద్దరు 'ఏక శరీర' మవుదురు (ఎఫెసీ 5:31). వివాహములో వారిద్దరు జీవితాంతము వరకు ఏకమవుదుమనే అంగీకారమును ప్రకటించుదురు.

ఈ ఏకత్వాన్ని జారత్వముగాని మరణముగాని మాత్రమే భంగపర చును. యిది కొంతమట్టు సత్యము. ఏలయనగా ఇద్దరు వివాహమాడి నప్పుడు వారి పరస్పర శరీరములపై సహితము అధికారమును కోల్పో వుదురు. పౌలు ఇట్లు వ్రాసాడు: "భర్తకే గాని భార్యకు తన దేహము పైని అధికారము లేదు. ఆలాగున భార్యకే గాని భర్తకు తన దేహము పైని అధికారము లేదు" (1 కొరి 7:4).

ఇట్టి విధముగానే మార్పు జెందునప్పుడు మనము క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరమైన సంఘముతో చేర్చబడుదుము గనుక క్రీస్తుతో గొప్ప ఏకత్వము సంభవించును. మనము క్రీస్తుతో ఏకమవుదుము- క్రీస్తు మనవాడు, మనము క్రీస్తువారము. మన జీవితాలపై మనకిక అధి కారమేమియులేదు; మనము క్రీస్తుకు చెందినవారము. మనము క్రీస్తుతో నిరంతరము ఏకము చేయబడి జీవింతుము (1 కొరి 6 : 16).

## క్రీస్తు ద్వారా ఐక్యత

రెండవదిగా, సంఘము క్రీస్తు శరీరమను మాటలో క్రీస్తు ద్వారా ఐక్యత సూచింపబడినది. జీవము కలిగి, వివిధ అవయవములు ఒకదానితో నొకటి కలిసి పనిచేయు శరీరముగా అది వర్ణింపబడినది. పౌలు ఇట్లు వ్రాసాడు: "ఏలాగు శరీరము ఏకమైయున్నను అనేక అవయవములు కలిగియున్నదో, యేలాగు శరీరము యొక్క అవ యవములన్నియు అనేకములైయున్నను ఒక్కశరీరమైయున్నదో, ఆలాగే క్రీస్తు ఉన్నాడు" (1 కొరింథీ 12 : 12). క్రీస్తుయొక్క ఏకైక శరీరములో అనేకులైన సభ్యులున్నారు. భౌతిక శరీరాన్ని గూర్చి పౌలు ఏమి చెప్పాడో క్రీస్తుయొక్క ఆత్మీయశరీరాన్ని గూర్చి కూడ అదే చెప్పవచ్చును. "శరీర మొక్కటే అవయవముగా ఉండక, అనే కములైన అవయవములుగా ఉన్నది" (1 కొరి 12 : 14). "అవయవ ములు అనేకములైనను శరీరమొక్కటే" (1 కొరి 12 : 19). అందు

వలన క్రైస్తవులు క్రీస్తు యొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములై యున్నారని చెప్పవచ్చును ( 1 కొరి 12 : 27).

'క్రీస్తు శరీరము' అనే పదము మనము క్రీస్తుకు చెందిన వారమని మాత్రమేగాక, భౌతిక శరీరములోని అవయవములవలె ఒకరొకరులకు చెందిన వారమని సూచించుచున్నది. శరీరములోని ఒక అవయవమునకు గాయము కలిగిన యెడల అవయవములన్నియు బాధనొందును అందువలన శరీరమనే భావంలోయున్న అర్థం యిది : "అయితే శరీరములో వివాదము లేక, అవయవములు ఒకదాని నొకటి యేకముగా పరామర్శించులాగున, దేవుడు తక్కువదానికే యెక్కువ ఘనత కలుగజేసి, శరీరమును అమర్చియున్నాడు. కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవము లన్నియు దానితోకూడ శ్రమపడును; ఒక అవయవము ఘనత పొందునప్పుడు అవయవము లన్నియు దానితోకూడ సంతోషించును" (1 కొరింథీ 12:25, 26).

'క్రీస్తు శరీరము' యొక్క భావము అర్థమైనప్పుడు, మతశాఖల తత్వము నాశనమగును. మతశాఖల తత్వము అనేక శరీరములను, వివిధ గుర్తింపులను, నమ్మకములను ప్రోత్సహించును. క్రీస్తుయొక్క శరీరతత్వము, క్రొత్తనిబంధనలో ఒకేఒక శరీరాన్ని, క్రీస్తు శరీరాన్ని సూచిస్తు ప్రతి క్రైస్తవుని దానిలో సభ్యునిగ సూచించును. వారు ఒకరి నొకరు ప్రేమిస్తు అందరి క్షేమాభివృద్ధిని కోరువారై యుందురు. క్రొత్త నిబంధన సంఘము క్రీస్తు శరీరమైతే, మతశాఖల తత్వము సంఘమునకు దేవుడేర్పరచిన నమూనా కానేకాదు. మతశాఖల తత్వమే సరియైతే, క్రొత్తనిబంధన సంఘము క్రీస్తుయొక్క ఏకైక శరీరము గానేరదు.

యేసుప్రభువు తాను అప్పగింపబడిన రాత్రి ఆయన యందు విశ్వాసముంచు వారందరి ఐక్యతకొరకు ప్రార్థించెను (యోహాను

17:21-24). ఆయన పునరుత్థానుడైన మొదటి పెంతెకొస్తునాడు ఆయన తన సంఘమును స్థాపించెను. అది ఈ లోకంలో ఆయన శరీరముగా యుంటూ ఆయన ప్రార్థించిన ఐక్యతను నెలకొల్పి కొన సాగించును. విభజనచేయు గోడలన్నియు పగులగొట్టబడెను: "ఇందులో యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు. దాసుడని, స్వతంత్రుడని లేదు; పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" (గలతీ 3:28).

క్రీస్తు శరీరములోని సభ్యుల ఐక్యత భౌతిక శరీరములోని అవ యవముల ఐక్యత వలె యుండును. కలిసి పని చేయుటలో ఐక్యత, ఒకరి నొకరు ప్రేమించుటలో ఐక్యత, ఒకరి నొకరు ఆదరించుటలో ఐక్యత గోచరమగును. శరీరములోని ఏ అవయవము కూడ వేరొక దానితో పోటీపడదు. ప్రతి అవయవము మిగతా అన్ని అవయవము లతో పనిచేయుచు కార్యసిద్ధిని కలుగజేయు ఒకే శరీరముగా మనకు గోచరమగును.

యేసు తన శిష్యులకు చేసిన ఒకే ఒక విజ్ఞాపన, వారందరు భూమిపై ఆయన ఆత్మీయ శరీరముగా యుండాలని చేసెను. వారు వివిధములైన మతశాఖలవలె వివిధములైన పేర్లు కలిగియుండాలని ఆయన కోరలేదు. మనం ఆయన యెడల నమ్మకముగా యుండాలంటే, ఆయన ఏకైక ఆత్మీయశరీరముగా యుండి ఆ కోరికను నెరవేర్చవలెను.

## క్రీస్తుకొరకు ఉపయోగము

మూడవదిగా, క్రీస్తుశరీరము అనునది క్రీస్తుకొరకు ప్రయోజన మును సూచించుచున్నది. ఈలోకంలో క్రీస్తు పని ఎట్లు జరగాలో అది సూచించును. పౌలు తన జీవితాన్ని గూర్చి, పరిచర్యను గూర్చి, "నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే" అని చెప్పాడు (ఫిలిప్పీ 1:21). అతడొక డినామినేషన్ కుగాని, మానవకల్పిత మతశాఖకుగాని చెందిన

వాడు కాదు. అతడు క్రీస్తుయొక్క ఆత్మీయ శరీరంలో సభ్యుడు మాత్రమే. మానవుల మధ్య సమాధానమును నెలకొల్పే దేవుని సాధనముగా తన్ను తాను ఎంచుకొన్నాడు. "కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్లు మేము క్రీస్తుకు రాయబారులమై - దేవునితో సమాధాన పడుడని క్రీస్తు పక్షముగా మిమ్ము ను బతిమాలు కొను చున్నాము" (2 కొరింథీ 5 : 20). ఇంకా తన శ్రమలను కూడ క్రీస్తు శరీరము కొరకు పడు శ్రమలుగా పౌలు ఎంచుకొన్నాడు: "ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నావంతు నా శరీరమందు సంపూర్ణము చేయు చున్నాను" (కొలస్స 1 : 24).

ఈ భూమిమీద క్రీస్తు యొక్క పని ఎట్లు కొనసాగింపబడాలి ? ఇప్పుడు క్రీస్తు పరమందున్న తండ్రి కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు గనుక ఆయన సువార్త పరిచర్య భూమిపై ఎట్లు కొన సాగింపబడాలి ? "క్రీస్తు శరీరము ద్వారా" అనేదే ఈ ప్రశ్నలకు జవాబు. సంఘమును స్థాపించుట ద్వారా, ఈ లోకమును ప్రేమించు టకును, పరిచర్య చేయుటకును క్రీస్తు తన ఆత్మీయ శరీరాన్ని లోకము లోనికి పంపించెను.

శిరస్సు లేని శరీరమును గూర్చిగాని, శరీరము లేని శిరస్సును గూర్చిగాని క్రొత్తనిబంధన ఎక్కడా చెప్పుటలేదు. భూమిపై క్రైస్తవులే లేకపోతే, నడిపించడానికి, నిర్దేశించడానికి, ఆయన పని చేయ డానికి క్రీస్తుకు ఒక శరీరమే లేక పోవును. క్రీస్తే తమ ఏకైక శిరస్సని, మార్గదర్శియని క్రైస్తవులు ఎంచుకొనకపోతే, సంఘము శిరస్సులేని శరీరముగా యుండును. యేసు తన సంఘము యొక్క శిరస్సు, మరియు ఆయన సంఘము ఆయన చిత్తమునకు లోబడినవారితో సమకూడినదై ఆయన కార్యనిర్వాహక వర్గముగా పనిచేయును.

క్రీస్తు పనిచేయుటకు క్రైస్తవులు ఆయన యొక్క ఆత్మీయ శరీరమైయున్నారు. ఈలోకపుటవసరాలను చూచుటకు మనమాయన కండ్లు. మానవావసరతలను మనము చూడక, వాటిని తీర్చక యున్న యెడల, ఆయన ఆత్మీయ శరీరపు కండ్లు చూపులేని కండ్లు. ఆయన వాక్యమును విని, ఆయన ఆజ్ఞలను గైకొనుటకు మనమాయన చెవులు. ఆయన ఆత్మీయ శరీరము ఆయన చిత్తమును వినుటలో చెవుడు కలిగినదైతే ఎంత విచారము! ఆయన వాక్యమును పలుకుటకు, ఆయనకు స్తోత్రములు పాడుటకు మనమాయన నాలుక, నేటిరోజుల్లో ఆయన ఆత్మీయ శరీరము మూగబోతే ఎంత ఘోరము! భారములు భరించుటకు బాధ్యతలు వహించుటకు మనమాయన భుజములు. ఆయన మనకిచ్చు బాధ్యతలను నిర్వర్తించునట్లు తన సంఘము బలముగాను, ఆరోగ్యవంతముగాను యుండాలని క్రీస్తు కోరుచున్నాడు. ఈలోకంలో ఆయన కొరకు పరుగెత్తుటకు మనమాయన పాదములు, ఆయన కొరకు పరుగెత్తుచు మనమాయన పాదములు బలపర్చాలి. పరిచర్య చేయు ఆయన జాలి గల చేతులు మనమే. అందువలన పరిచర్యకొరకు ఆయన చేతులు బలముగను, శక్తివంతముగను, పరిపూర్ణముగను యుండునట్లు మనము జాగ్రత్తవహించాలి.

క్రీస్తు ఆత్మీయశరీరము యొక్క ప్రయోజనములైన విజ్ఞాన, వికాసములను గూర్చి యోచించు. ఎక్కడైనా ఎప్పుడైనా ఒకడు క్రైస్తవుడైతే, అతడాయన పనిచేయుటకు, ప్రేమను ప్రతిబింబింపజేయుటకు కార్యాచరణ సభ్యుడగును. ఈ విధముగా అతడు క్రీస్తు సువార్త పరిచర్యను కొనసాగించును. అతడు క్రీస్తుతోను, ఆయన శరీరములోని మిగతా సభ్యులందరితోను ఏకమగును. అట్లు క్రీస్తు సంఘముయొక్క ఐక్యత ఈలోకములో ప్రత్యక్షమగుచున్నది. ప్రతి క్రైస్తవుడు బైబిలు పిలుచు రీతిగనే తన్నుతాను పిలుచుకొనును.

నడిపింపుకొరకు అతడు భూసంబంధమైన కేంద్రస్థానమువైపు యేమీ చూడడు, క్రీస్తువైపే చూచును. తత్ఫలితముగా సమస్త ఘనత మహిమలు క్రీస్తుకే చెందును. క్రీస్తు శరీరము ఎంత సూక్ష్మమైనదో, ఎంత జ్ఞానవంతమైనదో గమనించావా ?

పరిమితమైన మానవ మేధస్సుకే 'క్రీస్తు శరీర'మనే దానిలో గొప్ప జ్ఞానము కనబడుచున్నది. దానిలో దేవుని జ్ఞానము, మహిమలు ప్రతిబింబిస్తాయి. క్రీస్తు శరీరముగా క్రీస్తు మహిమ కొరకు మనము క్రీస్తు పనిచేయుదము గాక.

## ము గిం పు

భూమిమీద సంఘము క్రీస్తు శరీరమైయున్నది. ఈ సత్యమును బట్టి పౌలు రోమాలోయున్న క్రైస్తవుల కిట్లు వ్రాసాడు : "ఒక్క శరీరములో మనకు అనేక అవయవము లుండినను, ఈ అవయవము లన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో, అలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకని కొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము" (రోమా 12:4, 5). క్రైస్తవులగుటలో మనము క్రీస్తుతో ఐక్యతను, ఆయనద్వారా ఒండొరులతో ఐక్యతను కలిగి ఆయన కొరకు ప్రయోజకుల మవుదుము.

పెద్దపెద్ద బట్టల దుకాణములలో యున్న మనుష్యులను పోలిన బొమ్మలకును మానవులకును ఎంత తేడా యున్నదో! ఆ బొమ్మకును శరీరము, శిరస్సు వివిధ అవయవము లున్నను, దానికి ప్రాణము ఆత్మ లేదు. అట్లే మానవకల్పిత మతశాఖలకును క్రీస్తు సంఘానికిని యున్న తేడా ఎంత గొప్పదో. మతశాఖలు బట్టల కొట్టులలో యున్న బొమ్మలవంటివి. వాటిలో జీవము లేదు. అయితే క్రీస్తు సంఘములో జీవించే ఆత్మ యున్నాడు. దేవుని జీవంతో జీవించే శరీరం అది. దానికి

మార్గము చూపించువాడు, దాన్ని నడిపించువాడు క్రీస్తేగాని ఏ మానవుడు కాదు.

క్రొత్త నిబంధన సంఘము క్రీస్తుయొక్క శరీరమై యున్నది. ప్రతి క్రైస్తవుడు దానిలో సభ్యుడే. అదొక సంస్థ కాదు గాని, క్రీస్తు యొక్క ఆత్మతో సజీవముగా యున్న శరీరం, దాని శిరస్సయిన క్రీస్తుతో అది నడిపించబడును. క్రీస్తుయొక్క మహిమ కొరకు జీవిస్తు, పరిచర్య చేయుచు యుండుటయే ఈ లోకంలో దానియొక్క ప్రయోజనము. నీవు క్రీస్తు శరీరములో సభ్యుడవా? —ఎడ్డీ క్లోర (TFT)

— o —

## పే రు లో ఏ ము ం ది ?

ఈ లోకములో అనేకులు పేరులో ఏమిలేదు పేరు ప్రాముఖ్యమైనది కాదు, మంచిచెడ్డలు ఈ రెండు మాత్రమే ప్రాముఖ్యమందురు. కాని జ్ఞానియైన సొలొమోను ఇట్లనెను: "గొప్ప ఐశ్వర్యము కంటె మంచి పేరును వెండి బంగారముల కంటె దయయు కోరదగినవి." (సామె 22:1). సుగంధ తైలముకంటె మంచి పేరు మేలు (ప్రసం 7:1).

నామము అనగా నాకముక్రింద మనుజులకు ముందుండునది అని అర్థము. నామము అనునది ఒకవ్యక్తిని లేక వస్తువులను గుర్తించుట కొరకు ఈయబడిన కొన్ని పదముల కలయిక. మనకు పేరులేక పోయినచో ఏయ్, ఉయ్, ఓయ్ అని పిలుచు కొనవలసి వచ్చును. అందుకే మనము ప్రతీ ఒక్కరము ప్రత్యేకమైన పేరును కల్గియుందుము. సర్వసాధారణముగా అతనికి మంచి పేరులేదు. లేక అతడు మంచివాడు కాడు అని చెప్పుకొనుట వినుచునేయుందుము. కనుకనే మానవు లందరూ మంచి పేరుకోసం ప్రయాస పడుదురు. మనలను గూర్చి ఎవరైననూ చెడుగా చెప్పుకొనుటనుగాని మన పేరును పాడు చేయుటగాని ఒప్పుకొనము. మన ప్రవర్తనను బట్టి మంచి పేరుగాని

చెడ్డ పేరుగాని వచ్చును. "నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును. భక్తిహీనుల పేరు అసహ్యత పుట్టించును." (సామె 10 : 7) అని గలదు.

## పేరులో ప్రాముఖ్యత

దేవుడు పేరునకు అధిక ప్రాముఖ్యత నిచ్చెను "దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును ప్రతి ఆకాశ పక్షిని నేలనుండి నిర్మించి, ఆదాము వాటికి ఏ పేరు పెట్టునో చూచుటకు అతని యొద్దకు వాటిని రప్పించెను. జీవముగల ప్రతిదానికి ఆదాము ఏ పేరు పెట్టెనో ఆ పేరు దానికి కలిగెను. అప్పుడు ఆదాము సమస్త పశువులకును ఆకాశ పక్షులకును సమస్త భూజంతువులకును పేరులు పెట్టెను (ఆది. కా. 2 : 19-20). ఆది మానవుడైన ఆదాము పెట్టిన పేర్లు ఇప్పటికిని చిర స్థాయిగా కొనసాగుచునే ఉండును. ఇది నిత్య సత్యం.

పేరులో ఏమి లేక పోయినచో దేవుడు అబ్రాము పేరును అనేక జనములకు తండ్రి అని అర్థమిచ్చు అబ్రాహాముగాను అతని భార్య అయిన శారాయి పేరును రాజకుమారి అను అర్థమిచ్చు శారా గాను మోసగాడైన యాకోబు పేరును ఇశ్రాయేలు (అనగా దేవునితో పోరాడువాడు) గాను ఎందుకు మార్చెను? పేరునకు ప్రాముఖ్యత కలదు కనుక (ఆది 17 : 5, 15; ఆది 32 : 28).

బాప్తిస్మమిచ్చు యోహాను పుట్టక ముందు అతనికి పెట్టబోవు పేరును దేవుడు అతని తల్లిదండ్రులకు సూచించెను. "అప్పుడా దూత అతనితో జెకర్యా భయపడకుము, నీ ప్రార్థన వినబడినది, నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును, అతనికి యోహాను అనుపేరు పెట్టుదువు అనెను దూత చెప్పిన రీతిగా ఎలీసబెతు జెకర్యాలు వారు శిశువునకు యోహాను అను పేరు పెట్టిరి (లూకా 1 : 13, 59-63 వచనమువరకు). అట్లే మన ప్రభువు సర్వలోక రక్షకుడగు యేసుక్రీస్తు

నకు పెట్టవలసిన పేరును దేవుడు ముందుగానే మరియకు తెలియ జేసెను. "ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాప ములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు" పెట్టుమనెను (మత్తయి 1 : 21-25). ఆశిశువునకు సున్నతి చేయవలసిన యెనిమిదవ దినము వచ్చినప్పుడు గర్భమందాయన పడక మునుపు దేవ దూత చేత పెట్టబడిన యేసు అను పేరు వారు ఆయనకు పెట్టిరి (లూకా 2:21)

## అన్నిటికంటె పై నామము

యేసుక్రీస్తు ఘోర సిలువ మరణము పొందుటవలన తండ్రి ఆయనకు యిచ్చిన బహుమాన మేమనగా "ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొను నట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామము నకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను" (ఫిలిప్పీ 2 : 8-11). దేవుని నామము అత్యున్నతమైనది. మరి ఎవనివలనను రక్షణ కలు గదు. ఈ నామము (క్రీస్తు) ననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన (మరియ, మోషే, యేలీయా, పౌలు, లూథర్) మొదలగు పేర్ల వలన రక్షణ పొందలేము (అపొ.కా. 4:10-12) అని లేఖనములు హెచ్చరించుచున్నవి.

దేవుడు మనకొక పేరు ఇచ్చెదనని వాగ్దానము చేసెను. యెహోవా నియమింపబోవు క్రొత్త పేరు పెట్టబడును (యెషయా 62:2). ఈ క్రొత్త పేరును మొట్టమొదట అంతియొకయలోని శిష్యులు పొందిరి (అపొ.కా. 11:26). ఈ క్రొత్తపేరు ఏమనగా క్రైస్తవుడు. క్రైస్తవుడను పేరు క్రొత్తనిబంధనలో 3 పర్యాయములు కన్పించును (అపొ.కా. 11 : 26, 26 : 27-28; 1 పేతురు 4 : 16). క్రైస్తవుడని పిలిపించుకొనుటకు సిగ్గుపడకూడదు. ఆ పేరునుబట్టియే దేవుని మహిమ పరచవలెను (1 పేతురు 4:16).

భౌతికసంబంధమైన పేర్లకు మనము ఎంతో ప్రాధాన్యత ఇస్తాము. పులిని పిల్లి అని కోడిని నెమలి అని పిలువము. పులి పులే పిల్లి పిల్లే. అలాంటప్పుడు ఆత్మ సంబంధమైన పేరునకు ఎంత ప్రాధాన్యత ఇవ్వవలెనో ఆలోచించ మనవి. క్రీస్తు తన శ్రేష్టమైన నామమును సంఘమునకు తన బిడ్డలమైన మనకు ఇచ్చెను. కాని ఈనాడు అనేకులు మానవ సంబంధమైన పేర్లను కల్గిన సంఘములద్వారా దేవుని ఆరాధించుటకు ప్రయత్నించుచున్నారు. కొరింథీలో యున్న సంఘమును పౌలు ఇట్లు ఖండించెను. "మీలో ఒకడు నేను పౌలు వాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారు". వారు మానవ పేర్లను ధరించుకొన్నారు కనుకనే పౌలు ఖండించెను (1 కొరింథి 1:11). మరియు మాటచేతగాని క్రియచేతగాని, మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట అనగా ఆయన పేరు మీదుగా చేయవలెనని చెప్పబడినది (కొలస్స 3 : 17). ఈ దిగువ విషయములను ప్రేమతో గమనించవలెనని మా కోరిక.

1) సంఘము ఆత్మీయ యుద్ధము చేసే సైన్యం అని లేఖనములలో చెప్పబడినది. అయినను దేవుడు తన సంఘమును "రక్షణ సైన్యం" అని పిలువలేదు (ఎఫెసీ 6:11-18).

2) సంఘము పెద్ద (ప్రెస్బిటేరియన్, ఓవర్ సీర్, పాష్టర్స్, బిషప్స్) లచే పరిపాలించబడుచున్నను, అది ప్రెస్బిటేరియన్ అని పిలువబడవలెనని దేవుడు కోరలేదు (అపొ. కా. 20:28; తీతు 1:5).

3) సంఘము ఒక పద్ధతి లేక నియమము ప్రకారము క్రమముగా నడపబడుచున్నను అది మెథడిస్ట్ సంఘముగా లేఖనములు పేర్కొనలేదు (1 కొరింథి 14:40; ఫిలిప్పీ 3:16).

4) సంఘము సార్వజనికమైనది అయినను అది కేథలిక్ సంఘముగా పిలువబడుటను సత్యవేదము తృణీకరించుచున్నది. (మత్తయి 28 : 18-20; 16 : 16-18; అపో. కా. 2 : 47).

కనుక ప్రియ సహోదరి సహోదరా నీవు మానవ సంబంధమైన పేర్లతో దేవుని స్తుతింపదలచుట పాపము. మనకు పెట్టబడిన శ్రేష్టమైన నామము దూషణపాలు కాకుండా, క్రీస్తు నామమును ధరించుకొనుటకు జాప్యం చేయక వాక్యం విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది, క్రీస్తు సంఘములో చేర్చబడుము (2 కొరింథి 6:14-18; యాకోబు 2:7).

—పి. చంద్రశేఖర్,
స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ-3

— o —

కొండమీద ప్రసంగము-13

# ద్వేషము, నరహత్య
## (Hatred and Murder)
( మత్తయి 5 : 21-23 )

యేసుప్రభువు కాలమునాటి శాస్త్రిలు పరిసయ్యులు ధర్మశాస్త్ర ప్రకారము జీవించకుండా దానిని యితరులకు బోధించేవారు. "కాబట్టి ఈ ఆజ్ఞలలో మిగుల అల్పమైన దానిని మీరి మనుష్యులకు ఆలాగున చేయ బోధించువాడెవడో వాడు పరలోక రాజ్యములో గొప్పవాడనబడును. శాస్త్రిల నీతి కంటెను పరిసయ్యుల నీతి కంటెను మీ నీతి అధికము కాని యెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపరని" ఆయన చెప్పెను (మత్తయి 5 : 19-20). అటు తరువాత ఆయన యిట్లు బోధించెను : "నరహత్య చేయవద్దు : నరహత్య చేయువాడు విమర్శకులోనగునని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారు

గదా. నేను మీతో చెప్పునదేమనగా-తన సహోదరుని మీద కోప పడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" (మత్తయి 5 : 21-22).

## సార్వజనిక సూత్రము

"నరహత్య చేయవద్దు" అను సూత్రము అన్ని జనాంగముల లోను ప్రబలియున్న నైతిక సూత్రము. మన పొరుగువాని ప్రాణ మును గౌరవించడం అనేది మన ప్రాథమిక విధియైయున్నది. హేబె లును కయీను చంపినప్పుడు అతడేమి చేయుచున్నాడో ఎరుగక చేసియుండ వచ్చును. తన తమ్మునిపై అతనికి వున్నకోపము అతనిని ఒక మృగంగా చేసేసింది. అయినను అతడు ఘోరమైన శిక్షననుభ వింపవలసి వచ్చెను. "నీ తమ్ముని రక్తమును నీచేతిలోనుండి పుచ్చు కొనుటకు నోరు తెరచిన యీ నేలమీద ఉండకుండ నీవు శపింపబడిన వాడవు; నీవు నేలను సేద్యపరచునప్పుడు అది తన సారమును ఇక మీదట నీకియ్యదు; నీవు భూమిమీద దిగులు పడుచు దేశ దిమ్మరివై యుందువని" దేవుడు అతని శపించెను (ఆది. కా. 4 : 11-14). జల ప్రళయము తరువాత దేవుడు సార్వజనిక సూత్రము నొకదానిని చాటించెను: "నరుని రక్తమును చిందించు వాని రక్తము నరుని వలననే చిందింపబడును; ఏలయనగా దేవుడు తన స్వరూపమందు నరుని చేసెను" (ఆది. కా. 9 : 6). నాటినుండి నేటివరకు ఈ సూత్రము నైతికంగాను, ఆత్మీయముగాను అమలులోనే యున్నది.

ఈ సార్వజనిక సూత్రాన్ని అందరు తెలిసికోవాలి. మానవుని ప్రాణం పవిత్రమైనది. తన పొరుగువాని రక్తమును మానవుడు చిందించకూడదు. అతడట్లు చేస్తే రక్తము చిందించువాని రక్తము నరుని వలననే చిందింపబడును. యేసుప్రభువు కొండ మీద చేసిన

ప్రసంగములో యూదుల ధర్మశాస్త్రమును వివరించుట కంటె, తన స్వాధికారమునుబట్టి దానిలో దాగియున్న నైతిక ఆత్మీయ సూత్రాన్ని స్థాపించబూనుకొన్నాడు. నరహత్య చేయవద్దు; నరహత్యచేయువాడు విమర్శకు లోనగునని పూర్వీకులతో చెప్పబడిన మాటమీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా . అని చెప్పుచు అప్పటివరకు శాస్త్రుల ద్వారాను పరిసయ్యుల ద్వారాను వారు వినుచున్న వివరణను ఒకప్రక్క బెట్టి, తాను స్థాపించబోయే రాజ్యంలో, ఆయన సంఘములో యుండే నైతిక ఆత్మీయ సూత్రాన్ని ఆయన వివరించారు.

ఆయన రాజ్యంలో నరహత్య బహిష్కరింపబడడమే కాకుండ, కోపము కలిగించు మాటలు, తలంపులు మొదలైన వాటిని ఆయన బహిష్కరించుచున్నాడు. నరహత్య చేయుటద్వారా ఒకడు తన శరీరానికే కాదుగాని తన ఆత్మకు కూడ హాని కలుగ జేసికొనుచున్నాడు. “నేను మీతో చెప్పునదేమనగా తన సహోదరుని మీద (నిర్నిమిత్తముగా) కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును; తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీ అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును” అని యేసు ప్రభువు చెప్పెను (మత్త 5 : 21-22).

“నరహత్య చేయవద్దు” అనుమాట అసూయచేత బుద్ధిపూర్వకముగా చేయు హత్యను సూచిస్తుంది. ధర్మశాస్త్రకాలంలో నరహత్య చేయువానికి స్థానిక న్యాయాధిపతులు తీర్పు చెప్పేవారు (ద్వితీ 16:18; సంఖ్యా 35 : 16-33). పాతనిబంధన ప్రకారము నిజంగా హత్యచేసినవాడే శిక్షకు పాత్రుడగును. మీరు నేరుగా హత్య చేయకపోయినట్లయితే దేవునిదృష్టిలో అపరాధులు కారని శాస్త్రులు పరిసయ్యులు బోధించేవారు. దేవుని కుమారుడైన క్రీస్తుకు ఇట్టి భావార్థము సహింపరానిదిగా యుండెను. దేవుని ఆత్మతో ఆరాధించుటను గూర్చి మోషే

తప్పక తనప్రజలను ఆజ్ఞాపించియున్నాడు. దేవుని తత్వాన్ని బట్టి చేతులు కాళ్లకేగాక హృదయానికి కూడ ఆయన ఉపదేశించుచున్నాడని మనం గ్రహించుకోవచ్చును. మనం దేవుని యెడల సరియైన మనోభావాలను కలిగి యుండాలని, మనపొరుగువానియెడల కూడ అట్టి భావాలు కలిగియుండాలని ఆయన కోరుచున్నాడు: "ఇశ్రాయేలూ వినుము, మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా. నీపూర్ణ హృదయముతోను, నీపూర్ణాత్మతోను, నీపూర్ణశక్తితోను నీదేవుడైన యెహోవాను ప్రేమింపవలెను, మరియు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను" అని పూర్వకాలమందే ఆజ్ఞాపించి యున్నాడు (ద్వితీ 6:4, 5; 10:12).

యేసు ప్రభువు ఏమి బోధించుచున్నాడంటే హత్య చేస్తేనే మీరు అపరాధులని చెప్పబడుట మీరు ఇంతవరకు విన్నారు గాని, నీవు నీ పొరుగు వానిని ద్వేషిస్తేనే మీరు అపరాధులు. మాచేతుల మీద రక్తములేదని మీరంటారు, అందువలన దేవునియెదుట మేము నిరపరాధులమని మీ రనుకోవచ్చును! అయితే అట్లుకానేకాదు. మీరు హృదయాన్ని గూర్చి ఒక్కమాటకూడ చెప్పలేదు. దేవుడు హృదయమునుండి కోరుదానిని గూర్చి మీరు ఒక్కమాట కూడ చెప్పలేదు. నరహత్యను గూర్చిన ఆజ్ఞను మీరు సామాన్య పౌర చట్టమువలె చేసేసారు. తద్వారా దానిలో ఇమిడియున్న ఆత్మీయ సూత్రాన్ని నాశనం చేసేసారు. మీరు మీ పారంపర్యాచారము వలన దేవుని మాటను నిరర్థకము చేసేసారని ఆయన బోధించిన దాని సారాంశము.

## తలంపులోనే త్రుంచివేయాలి

తరువాత, హత్య చేస్తేనే మనుష్యుడు అపరాధియగును అనే సిద్ధాంతాన్ని మోషే బోధించలేదని యేసుప్రభువు చెప్పారు. నీవు

పైకి బాగా కనబడుచున్నను నీ అంతరంగ హృదయం కుళ్లుపట్టియుంటే ఫరవాలేదని మోషే యొక్క అభిప్రాయంకాదు. ధర్మశాస్త్రానికి బాహ్యంగా నీవు కట్టుబడి లోబడియుంటే సరిపోదు. బాహ్యంగా కనబడే పాపములు ఎంత నిందించబడాలో అంతరంగములో జరిగే పాపములు అంత నిందించబడాలి. ఎవడైనా నరహత్యచేసి ఉరిశిక్షకు పాత్రుడయ్యాడంటే వాడే దోషి అని నీవనుకొనవద్దు. నీవు నీకుర్చిలో కూర్చొని నీ పొరుగు వానిని ద్వేషించినా, నీ సహోదరుని మీద కోపబడినా, వానిని వ్యర్థుడా అని చెప్పినా నీవును ఆ నరహంతకునితో సమానుడవే. శాస్త్రులు పరిసయ్యులు ఇట్టి హృదయాలోచనల సరికట్టడం మాని, బాహ్య క్రియలనే ఎత్తి చూపించేవారు. బాహ్య క్రియ జరిగేవరకు క్రీస్తు కనిపెట్టలేదు. ఆ క్రియను గూర్చిన తలంపులు ఉద్భవించే స్థానాన్ని ఆయన అరికట్టుచున్నాడు. హత్యలు, దొంగతనములు వగయిరా అన్నీ హృదయంలోనే ఆరంభమవుతాయి "నోటినుండి బయటికి వచ్చునవి హృదయములోనుండి వచ్చును; ఇవే మనుష్యుని అపవిత్రపరచునని మీరు గ్రహింపరా? దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణములు హృదయములో నుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్రపరచును" అని యేసు ప్రభువు బోధించారు (మత్తయి 15 : 18-20). అందువలన నరహత్య ఆరంభమయ్యేచోట, హృదయాన్ని యేసుప్రభువు అరికట్టుచున్నాడు. దాని తలంపులోనే అది త్రుంచివేయబడితే, ఇక నరహత్య జరిగే పనేలేదు. హృదయంలో హత్య జరుగక మునుపే దేవుడు దానిని నివృత్తి చేయుచున్నాడు.

ఈ రోజు నీవొక నరహంతకుడవై యుండవచ్చును! నీవు నిజానికి భౌతికంగా ఎవరిని హత్యచేసి యుండకపోవచ్చును. కయీనువలె

నీవు ఎవరిని హత్య చేసియుండక పోవచ్చును లేదా దావీదు ఊరి యాను చంపించినట్లు నీవు ఎవరిని చంపియుండక పోవచ్చును గాని నీవు నరహంతకుడవేమో గమనించుకొనుము! నీవు నీ భార్యనుగాని, భర్తనుగాని, బంధువులనుగాని, మిత్రులనుగాని, పొరుగువారినిగాని ద్వేషించువానివా? అయితే నీవు నరహంతకుడవయ్యే ప్రమాదము లేకపోలేదు. నీవు ఈ లోకమునైనను, ఈ లోక సంగతులనైనను ప్రేమించుచున్నావా? ఈ లోక సంబంధమైన దురలవాట్ల చొప్పున పరిశుద్ధాత్మకు ఆలయమైన నీ దేహమును స్వయంగా హత్యచేసికొను చున్నావేమో, ఒకసారి చూచుకో. తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును, తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును, ద్రోహీ అని చెప్పువాడు నర కాగ్నికి లోనగునని యేసుప్రభువు చెప్పెను.

## నాలుకనుగూర్చి జాగ్రత్త

మనం నిజంగా యేసుప్రభువు శిష్యులమై యుండాలనికోరుచున్న యెడల మన హృదయాలను మనమే పరీక్షించుకోవాలి. మన నాలు కను అదుపులో యుంచుకోవాలి, "నాలుక చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగుల బెట్టును! నాలుక అగ్నియే! నాలుక మన అవయవములలో ఉంచబడిన పాప ప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగ జేయుచు ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; అది నరకముచేత చిచ్చుపెట్టబడును" (యాకోబు 3:5, 6). మన నాలుకను అదుపులో యుంచుకొనక పోతే నరకాగ్నికి లోనయ్యే ప్రమాదమున్నది.

ప్రేమ లేనివాడు మరణమందు నిలిచియున్నాడు. తన సహో దరుని ద్వేషించువాడు నరహంతకుడు, ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీరెరుగుదురు". "చిన్న పిల్లలారా మాటతోను

నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము" అని భక్తుడైన యోహాను చెప్పుచున్నాడు (1 యోహాను 3:14, 15, 18).

క్రీస్తు మార్గము అతిశ్రేష్ఠమైనది. అది బాహ్యక్రియలనేగాక హృదయతలంపులను పరిశోధించునట్టిది. నీవు ఎవరిని నిజంగా హత్య చేయనవసరం లేదు. కాని దాని సంబంధమైన ఈర్ష్య, ద్వేషము, పగ వగయిరాకలిగి, హృదయంలో ఆలోచిస్తేనే నీవు అపరాధివి. దేవుని స్వరూపములో చేయబడ్డ నీ పొరుగు వానిని ద్వేషించినా. తూలనాడినా, దుర్భాషలాడినా హత్య చేసిన వానికెంత శిక్ష విధించబడునో నీకును అంతే శిక్ష విధించబడును.

క్రీస్తును వెంబడించుము. నీ హృదయాన్ని ఆయనకు సమర్పించుకొనుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము.

— జాషువా గూటం

—o—

## అమె తన శక్తికొలది చేసెను

## ( She has done what she could )

మనలో ప్రతివారు ఏదో ఒక రోజున మరణించవలసినదే యని బైబిలు బోధించుచున్నది. "మనుష్యులొకసారే మృతి పొందవలెనని నియమింపబడెను, ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). నీ మరణానంతరము ప్రజలు నిన్ను ఎలా జ్ఞాపకముంచుకొనవలెనని కోరుదువు? నీవు కష్టించి పనిచేసే వ్యక్తివనా లేక సోమరివని జ్ఞాపకముంచుకొనబడెదవా? దయగల వ్యక్తివలెనా? లేక క్రూర ప్రవర్తన గల వ్యక్తిగా జ్ఞాపకముంచుకొనబడెదవా? నీకు గొప్ప శక్తి సామర్థ్యములున్నా, వాటిని వినియోగించని వ్యక్తిగా నిలచిపోదువా? నీ జీవితం గూర్చి ప్రజలు ఏమి జ్ఞాపకం చేసికొందురు?

బైబిలు నందలి మార్కు సువార్తలో ఒక స్త్రీ తనకు తెలిసిన శ్రేష్ఠమైన విధానములో యేసుని ఘనపరచిన సంఘటనను మనము చదువగలము. ఒకనాడు యేసు సీమోను ఇంట భోజనము చేయుచుండగా ఆ స్త్రీ మిక్కిలి విలువగల అచ్చ జటామాంసి అత్తరు బుడ్డి తీసికొనివచ్చి దానిని పగులగొట్టి యేసు తలపై పోసెను. కొందరు ప్రజలు అది చూచి "ఈ అత్తరు ఈలాగు నష్టపరచనేల? ఈ అత్తరును అమ్మి బీదలకు ఈయవచ్చునుగదా" అనిరి. అందుకు యేసు ఇట్లనెను - ఈమె జోలికి పోకుడి; ఈమెను ఎందుకు తొందరపెట్టుచున్నారు? ఈమె నా యెడల మంచికార్యము చేసెను. బీదలు ఎల్లప్పుడును మీతోనే యున్నారు, మీ కిష్టమైనప్పుడెల్ల వారికి మేలు చేయవచ్చును; నేను ఎల్లప్పుడును మీతో నుండను. ఈమె తన శక్తికొలది చేసి, నా భూస్థాపన నిమిత్తము నా శరీరమును ముందుగా అభిషేకించెను. సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంసింపబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మార్కు 14:6-9).

ఆ స్త్రీ చేసినదానికి యేసు ఆమెను అభినందించెను. నీ తోటి క్రైస్తవులతో కలసి తండ్రియైన దేవుని మరియు ఆయన కుమారుడైన క్రీస్తును ఆరాధించుటయే గాక నీవు క్రీస్తును ఘనపరచుటకు యింకనూ ఏమి చేయగలవు? ఇద్దరు వ్యక్తులు ఈ ప్రశ్నకు ఒకే సమాధానము చెప్పజాలరు. కొందరు యితరులకంటె ఎక్కువ సామర్థ్యము కలిగియుందురు. కొందరు ధనము, మరికొందరు ఎక్కువ సేవ చేయు అవకాశము కలిగియుందురు. కొందరైతే సంపూర్ణ విశ్వాసముతో శ్రమలను కూడా సంతోషముగా భరించగలవారై యుందురు. ప్రతివారు తమ సామర్థ్యముననుసరించి యేసుని సేవించి, ఘనపరచగలరు. యేసుని ఘనపరచుటకు నీ జీవితములో ఏమి చేయగలవు? అయితే

యేసు "ఆమె తన శక్తికొలది చేసెను" అని నిన్ను గూర్చి చెప్ప గలిగితే అద్భుతము కాదా !

— o —

## సంక్షిప్త వార్తలు

ఫిబ్రవరి 27వ తేదీనాడు ముక్తేశ్వరానికి సమీపముగా నున్న కొండుకుదురు గ్రామములో జరిగిన బహిరంగ సువార్త కూటము నకు వందలాది ప్రజలు హాజరు కాగా, సోదరులు బూల యోహాను, జాషువా గూటం, N. ఏలియా, పాల్ గూటం గార్లు వాక్యపరిచర్య చేసిరి. ఆరుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. స్థానిక క్రీస్తు సంఘము గొప్ప ఆదరాభిమానములతో పరిచర్య చేసిరి. అక్కడ దొగ్గా సామ్యేల్ గారు సువార్త చాటుచున్నారు.

మార్చి 1వ తేదీ బుధవారం తూర్పుగోదావరి జిల్లా నల్లగొండ గ్రామములో నిర్మింపబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గూటంగారు రిబ్బను కత్తిరించి తెరిచిరి. ఆ సందర్భముగా జరిగిన కూటమునకు సోదరి కవిత గూటంగారు కూడ హాజరైరి. ఆ రోజు జరిగిన కూటం అనంతరం ఇద్దరు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు బి. ధర్మరాజుగారు నల్లగొండ, కోటి, రఘుదేవరపురం మొదలగు గ్రామాలలో మంచి సువార్తపని చేయుచున్నారు.

మార్చి 7 నుండి 10 వరకు విజయవాడ - దుర్గాపురం క్రీస్తు సంఘము బైబిలు తరగతులు మరియు సువార్త కూటములు నిర్వహించిరి. పగలు ఇంచుమించు రెండువందల మంది, రాత్రిలందు 300 మంది హాజరయ్యేవారు. సోదరులు టి ప్రసాదరావ్, జి. మార్కు, N. టైటస్, పాల్ గూటంగార్లు చక్కటి వాక్యపరిచర్య చేయగా నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. దుర్గాపురం ఏరియాలో

సోదరులు కె. రాజకుమార్ గారు గొప్ప సేవను జరిగించుచున్నారు. అక్కడి క్రీస్తు సంఘము దినదినాభివద్ధి నొందుచున్నది.

మార్చి నెల సువార్తికుల సదస్సు 21వ తేదీ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో జరిగెను. ఆ రోజు గొప్ప ఆనందోత్సాహములతో పలుప్రాంతములనుండి వచ్చిన 150మంది సువార్తికులు, పలువురు స్థానికులు, స్థానిక క్రీస్తు సంఘ సభ్యుల సమక్షములో "అన్ని నామములకంటె క్రీస్తు నామము ఏల ఉన్నతమైనది? సంఘము క్రీస్తు నామమును ధరించవలెనా?" అను అంశము చర్చింపబడెను.

ఆత్మీయ విషయాల్లో బైబిలు పేర్లను ధరించని వారు పేరులో ఏమీ లేదు, ఏ పేరు పెట్టుకొనినను ఫరావాలేదని చెబుతారు. అయితే పేరులో విశిష్టత యున్నది. గనుకనే దేవుడు అబ్రాము, శారాయిల పేరును అబ్రహాము, శారాలుగ మార్చెను (ఆది. కా. 17:5). మరియు యేసుక్రీస్తు పేరులో రక్షణయున్నది. యేసు అనగా రక్షకుడని, క్రీస్తు అనగా అభిషిక్తుడని యర్థము. రక్షణ క్రీస్తులోనే యుంటే ప్రజలు మరింకెక్కడికో వెళ్ళనవసరంలేదు. ఆయననామము మూలముగా జనులు రక్షణ పొందవలెనని జగత్పునాది వేయబడక ముందే దేవుడు నిర్ణయించెను (అపొ.కా. 10:43). ఆయన రక్షకుడు, మరణించి సమాధిచేయబడి, మూడవ దినమున తిరిగి లేచిన ఏకైక మూర్తి, దేవుడు; అందువలన ఆయన నామము అన్ని నామములకంటె ఉన్నతమైనది.

సంఘమును ఆయన తన స్వరక్తమిచ్చి కొన్నారు. ఆయన దానికి రక్షకుడు, శిరస్సు, సంరక్షకుడు, పునాది, సమస్తమూను గనుక సంఘము ఆయన నామమును తప్పక ధరించాలి. మరియు మానవుడు ఆశీర్వదించబడాలంటే ఆయన నామమును జ్ఞాపకార్థకముగా నుంచుకొను స్థలములో (సంఘములో) యుండాలి (నిర్గమ 20 : 24; ఎఫెసీ 3:20, 21). మానవ కల్పిత సంఘములలో యుండువారు ఆయననుగాక మానవులను ఘనపరుస్తారు. నిజానికి యేసుక్రీస్తు "దాసులు ఆయనను

సేవించుచు, ఆయన ముఖదర్శనము చేయుచుందురు; ఆయన నామము వారి నొసళ్ళయందుండును" (ప్రక 22:4). మరియు ఆయన జనులు ఆయన నామమును తెలిసికొందురు (యెషయా 52 : 6). ఒకడు క్రీస్తు యేసుద్వారా రక్షింపబడాలని కాంక్షించుచున్నయెడల రక్షణయున్న క్రీస్తు సంఘములో తప్పక యుండాలి.

పై అంశములను సోదరులు D. అబ్రహాము, N. మోజెస్, M.L. క్రిష్టాఫర్, K. కొర్నేలియస్, G. షడ్రిక్, B. యోహాను, A. కాసు, చుక్కా అప్పారావు మరియు పాల్ గూటం గార్లు చక్కగా వివరించిరి. సోదరులు G. షడ్రిక్, V. హిట్లర్, N. ఏలియా, D. ఆశీర్వాదం గార్లు ప్రార్థనలలో నడిపించిరి. స్థానిక క్రీస్తు సంఘము, సోదరులు జాన్ ఫ్రెడరిక్స్‌గారు వారి కుమారుడు ఫ్లెమింగ్స్‌గారు చక్కటి పరిచర్యచేసిరి. సదస్సు అనంతరం 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఏప్రియల్ నెల సువార్తికుల సదస్సు 26వ తేదీ బుధవారం నాడు తూర్పు గోదావరి జిల్లా శంఖవరంలో జరుగును.

---

Regd. No. H/KD—45/KD H.O
Date of Posting : 15th of Every month

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..............................................
..............................................
..............................................
..............................................